సైబర్ నేరాలపై సమరం..

-పోలీసులతో ఇన్ఫ్లుయెన్సర్ల జత
-జాగృత్ హైదరాబాద్ ..సురక్షిత్ హైదరాబాద్ క్యాంపెయిన్
-షార్ట్ విడియోలతో మోసాలపై వినూత్న అవగాహన
-నవ్విస్తూనే కళ్లు తెరిపిస్తున్న కంటెంట్ క్రియేటర్లు
-సామాజిక బాధ్యతగా ముందుకు రావాలని సిపి సజ్జనార్ పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీసులు సరికొత్త వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. కేవలం అధికారిక హెచ్చరికలకే పరిమితం కాకుండా, సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యే రీతిలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ద్వారా విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్ సిపి వీసీ సజ్జనర్ ఆధ్వర్యంలో విజయవంతంగా కొనసాగుతున్న "జాగృత్ హైదరాబాద్ - సురక్షిత్ హైదరాబాద్" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ నూతన విధానానికి విశేష స్పందన లభిస్తోంది. పోలీసుల పిలుపు మేరకు పలువురు ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, సైబర్ నేరాల తీరుతెన్నులను వివరిస్తూ తమదైన శైలిలో వీడియోలు రూపొందిస్తున్నారు. వీటిని సిపి సజ్జనర్, ఇన్స్టాగ్రామ్ ఖాతాలతో కొలాబరేట్ చేయడం ద్వారా లక్షలాది మందికి చేరువ చేస్తున్నారు. వినోదాత్మకంగా ఉంటూనే, అత్యంత కీలకమైన సైబర్ భద్రతా సూచనలను ఈ వీడియోలు ప్రజలకు అందిస్తున్నాయి.

ఆలోచింపజేస్తున్న వీడియోలు..

ఇన్ఫ్లుయెన్సర్లు ఇటీవల రూపొందించిన వీడియోలు ఎంతో వైవిధ్యంగా ఉండి నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లాటరీ మోసాలపై కళ్లు తెరిపిస్తూ "దేశీ మామ్ వర్సెస్ స్కామర్" కాన్సెప్ట్‌తో రూపొందిన వీడియో ప్రాక్టికల్‌గా ఆలోచింపజేస్తోంది. "మీకు రూ.25 లక్షల లాటరీ తగిలింది.. ప్రాసెసింగ్ ఫీజు కోసం ఓటీపీ చెప్పండి" అంటూ వచ్చే ఫేక్ కాల్స్‌ను ఓ గృహిణి ఎంత చాకచక్యంగా తిప్పికొట్టిందనేది ఇందులో చూపించారు. అత్యాశకు పోకుండా, అపరిచితులతో బ్యాంక్ వివరాలు, ఓటీపీలు పంచుకోకూడదనే స్పష్టమైన సందేశాన్ని బలంగా వినిపించారు.

డిజిటల్ అరెస్ట్‌పై కనువిప్పు..

ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాల గుట్టును మరో వీడియో ద్వారా విప్పారు. సైబర్ నేరగాళ్లు సీబీఐ, పోలీస్, ఆర్బీఐ అధికారులమంటూ నకిలీ యూనిఫామ్స్ ధరించి.. వీడియో కాల్స్ ద్వారా ఏ విధంగా భయభ్రాంతులకు గురిచేస్తారో కళ్లకు కట్టారు. "భారతదేశంలో ఏ ప్రభుత్వ దర్యాప్తు సంస్థ వీడియో కాల్ ద్వారా విచారణ చేయదు" అన్న వాస్తవాన్ని ప్రజలకు స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్స్ వస్తే భయపడకుండా.. తక్షణమే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయాలని ఈ వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. సామాన్యులకు సైతం సులువుగా అర్థమయ్యేలా పోలీసులు, ఇన్ఫ్లుయెన్సర్లు సంయుక్తంగా చేస్తున్న ఈ ప్రయోగానికి నెటిజన్ల నుంచి అద్భుతమైన మద్దతు, ప్రశంసలు లభిస్తున్నాయి.

ఫాలోయింగ్‌ను సమాజ హితం కోసం వాడండి: సిపి సజ్జనార్

సైబర్ నేరాల కట్టడికి మరింత మంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు ముందుకు రావాలని పోలీస్ కమిషనర్ సజ్జనం విజ్ఞప్తి చేశారు. "సామాజిక మాధ్యమాల్లో మీకు విశేషమైన ఫాలోయింగ్, గుర్తింపు ఉన్నాయి. దాన్ని సమాజ మార్పు కోసం వినియోగించండి. మీ మాటలకు ప్రజల ఆలోచనా విధానాన్ని మార్చే శక్తి ఉంది. సైబర్ నేరాలపై ప్రభావవంతమైన షార్ట్ వీడియోలు రూపొందించి మీ ప్లాట్‌ఫామ్స్ ద్వారా షేర్ చేయండి. సురక్షితమైన, చైతన్యవంతమైన సమాజ నిర్మాణం మనందరి ఉమ్మడి బాధ్యత," అని ఆయన పిలుపునిచ్చారు.

ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన రైతు బాడీ అగ్రి షో 2026 యొక్క 3వ ఎడిషన్‌ను సందర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు, హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

వైద్యుల నిర్లక్ష్యానికి.. పసిబాలుడు మృతి

-కుటుంబ సభ్యుల్లో నింపిన విషాదం

శిశువు మృత దేహంతో ఏడుస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు

అత్తాపూర్ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : వైద్యుల నిర్లక్ష్యానికి వైద్యం వికటించి ఆరు నెలల శిశువు మృతి చెందిన విషాద ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... బండ్లగూడ జాగీర్ పరిధిలోని వికాస్ నగర్‌లో ఉండే విష్ణువర్ధన్‌రెడ్డి, అశ్వినీ దంపతులకు ఇద్దరు కుమార్తెలు,మూడో సంతానంగా ఆరు నెలల కుమారుడు ఉన్నారు. శనివారం కుమారుడికి జ్వరం రావడంతో స్థానిక క్రేయాన్స్ హాస్పిటల్ ఫర్ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్‌కు తీసుకువెళ్లగా వైద్యుడు అభిషేక్, సిబ్బంది బాలుడు రామును పరిశీలించి గడువు ముగిసిన ఇంజక్షన్ ఇచ్చారు. అది వికటించింది. కొద్దిసెప్పటికే బాలుడు చూస్తుండగానే తల్లి ఒడిలో ప్రాణాలు వదిలాడు. గుండె ఎక్కువ వేగంతో కొట్టుకోవటం కోసం ఇచ్చే ఇంజక్షన్ వేశారు. ఆ మందు ప్రభావం తట్టుకోలేక ప్రాణాలు విడిచాడు. ఉన్న ఒక్కగానొక్క వంశాంకురం డాక్టర్ల నిర్లక్ష్యానికి బాలికావటం ఆకుటుంబాన్ని తీవ్రంగా కలిచి వేసింది. తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమైయ్యారు. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బాధిత బంధువులు, స్థానికులు హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని శాంతింపచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు హాస్పిటల్‌పై కేసు నమోదు చేస్తున్నారు.

ఇంటి యజమాన్ని బాధలను భరించలేక గృహిణి ఆత్మహత్య

అల్వాల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఇంటి యజమాని బాదలను భరించలేని గృహిణి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. హస్మత్‌పేట్ అబ్రహార్ మస్జిద్ సమీపంలో షేక్ సాబేర్ తనభార్య తబాసుమ్(42) నలుగురు సంతానంతో నివాసం ఉంటున్నాడు. రెండు రోజులు క్రితం ఇరవై ఏళ్ళుగా అద్దెకు ఉంటన్న ఇంటిని ఖాళీ చేసి సమీపంలోని మాల బస్తీకి వెళ్ళడం జరిగింది. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 3 గంటలు సమయంలో తబాసుమ్ పాత ఇంటిలో మిగిలి ఉన్న బట్టలు ఇతర సామగ్రి తీసుకోవడానికి వెళ్ళింది. అక్కడి నుంచి భర్త షేక్ సాబేర్‌కు ఓ. వాట్సప్ మెసెజ్ చేసింది. ఇంటి యజమాని తనను మానసికంగా హింసిస్తున్నాడని, అడ్వాన్స్ తిరిగి ఇవ్వక పోగా మోటార్ ఇతర వస్తువులు పాడైనట్లు చెబుతున్నట్లు తెలిపింది. తన అనుమతి లేకుండా పలుమార్లు ఇంటి లోపలకి వచ్చి ఇబ్బందులకు గురి చేసే వాడని పేర్కొంది. ఐదున్నర గంటలు సమయంలో భార్య కోసం పాత ఇంటికి వచ్చి చూసే సరికి భార్య వంట గదిలో ఉరి వేసుకుని ఉంది. షేక్ సాబేర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

-అధికారులను ఆదేశించిన మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్ ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త) : మల్కాజిగిరి నగరపాలక సంస్థ (ఎం.ఎం.సి) పరిధిలో చేపట్టిన ప్రతిష్టాత్మక మోలిక సదుపాయాల ప్రాజెక్టులు హెచ్‌సిటీ , ఎస్.ఎన్.డి.పి) పనుల పురోగతిపై కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మల్కాజిగిరి నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ ఇతర ఉన్నతాధికారులతో కలిసి పనుల స్థితిగతులను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హెచ్‌సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మటివ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్) ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన 4 కీలక ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రధానంగా ఏఓసీ సెంటర్ ఫ్లైఓవర్, రోడ్ ఓవర్ బ్రిడ్జి లైన ఆర్.కె పురం , ఆర్.కె పురం , టీకేఆర్ కమాన్ నుండి మంద మల్లమ్మ వరకు ఫ్లైఓవర్ ప్రాజెక్టులకు సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం ఎస్.ఎన్.డి.పి పనులపై సమీక్షిస్తూ మొత్తం 9 కొత్త నాలాల పనులలో ఇప్పటికే 6 నాలాల పనులు పురోగతిలో ఉన్నాయని, మిగిలిన 3 నాలాల పనులను తక్షణమే వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే నాలాల పూడికతీత పనులన్నీ పూర్తి చేయాలని, తద్వారా లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు

న-పాల్గొన్న సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షిత కృష్ణమూర్తి

కార్యక్రమంలో పాల్గొన్న సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షి త కృష్ణమూర్తి ఇతర అధికారులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: వీడియో గెమ్‌ల ద్వారా కూడా సైబర్ క్రైంలు పెరిగిపోయాని, పిల్లలు ఇష్టానుసారంగా గేమ్‌లు ఆడుతూ బలవుతున్నారని సికింద్రాబాద్ జోన్ డీసీపీ రక్షిత కృష్ణమూర్తి తెలిపారు. వారాసిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని జామియా ఉస్మానియా వద్దగల ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో భారీ సైబర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమే మాట్లాడుతూ మొబైల్ ఫోన్స్‌లో క్యాండీ క్రష్ వంటి ఆటలు ఆడుతుండగా, ఒక లెవల్ నుండి మరో లెవల్‌కి వెళ్ళినప్పుడు ఫ్రీ గిఫ్ట్ ఆఫర్‌లు వస్తుంటాయని, ఆ లింకులను నొక్కినప్పుడు అవి మనల్ని ప్రమాదకరమైన పేజీలకు తీసుకెళ్లి, అనధికారిక యాప్‌లను డౌన్‌లోడ్ చేసేలా ప్రోత్సహిస్తాయి" అని ఆమె హెచ్చరించారు. ఇలాంటి వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చిలకలగూడ ఏసీపీ కె. శశాంక్ రెడ్డి, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ రవీందర్ గౌడ్, సెక్టర్ ఎస్సై రామచంద్రారెడ్డి, సికింద్రాబాద్ జోన్ మహిళా ఎస్సై మేఘన ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ వార్త

ఓటర్ల మ్యాపింగ్ సర్వే వేగంగా చేపట్టాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ఓటర్ల మ్యాపింగ్ సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, ఆర్.వి.కర్ణన్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ముందస్తు సన్నాహాల్లో భాగంగా హైదరాబాద్‌లో చేపడుతున్న ఓటర్ల మ్యాపింగ్ సర్వేమరింత చురుగ్గా, వేగంగా జరిగేలా చూడాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలను ఆదేశించారు. ఈమేరకు శనివారం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ తో కలిసి సికింద్రాబాద్ నియోజకవర్గంలోని మాణికేశ్వర్ నగర్ పోలింగ్ కేంద్రం 211 పరిధిలో ఓటరు జాబితాసవరణ చేపట్టిన ప్రోజెన్సీ మ్యాపింగ్‌ను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం చార్మినార్ నియోజకవర్గంలోనిలో కబుత్తరుఖానా పోలింగ్ కేంద్రం 12 పరిధిలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం బూత్ లెవెల్ అధికారులు, సూపర్ వైజర్‌లతో మాట్లాడారు.మ్యాపింగ్ ఎట్లా చేస్తున్నారంటూ ప్రశ్నించారు. మ్యాపింగ్ పై వారికి ఉన్న అవగాహన ను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి.. 2002 జాబితాలోని ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలను 2025 జాబితాను పోల్చుతున్నామని తెలిపారు. 2002 జాబితాలో పేర్లున్న ఓటర్ల కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి... ప్రస్తుత జాబితాలో ఉంటే వారి పేర్లను మ్యాపింగ్ చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ జరిగిన ప్రోజెన్సీ మ్యాపింగ్ పురోగతిని ఈఆర్‌వోలు ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రోజెన్సీ మ్యాపింగ్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రోజెన్సీ మ్యాపింగ్ చురుగ్గా చేపట్టి వేగంగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికల జాబితాల్లో కచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను పాటించడమే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం చేపట్టనుందని తెలిపారు. క్షేత్ర పరిశీలనలో ప్రధాన ఎన్నికల అధికారి వెంట అదనపు కమిషనర్ (ఎన్నికల విభాగం) చంద్రకళ, సరిత, ఆంజనేయులు, సుధీర్ రెడ్డి, ఎన్నికల విభాగం సహాయ మున్సిపల్ కమిషనర్ విమల తదితరులు ఉన్నారు.

ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే జ్ఞానసంపద పెంచుకోవాలి

-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్, ఫిబ్రవరి 22,ప్రభాతవార్త: ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు విద్యార్థులు నిరంతర జ్ఞానసంపద పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ హరిచంద్ర దాసరి అన్నారు.శనివారం అబిడ్స్ లోని స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్రపంచ ఆలోచనా దినోత్సవం (వరల్డ్ థింకింగ్ డే) సందర్భంగా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 22న స్కౌట్ ఉద్యమం స్థాపకుడు లార్డ్ రాబర్ట్ స్టీఫెన్సన్ స్మిత్ బాడెన్ పోవెల్ జన్మదినం రోజును ప్రపంచ ఆలోచన దినోత్సవంగా జరుపుకోబడుతుందని కలెక్టర్ వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ మానవ జీవనశైలిలో ఆలోచన అత్యవసరమైన నైపుణ్యమని తెలుపుతూ చదువుతో పాటూ, శారీరక, మానసిక, సామాజిక సర్వతోముఖాభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదిగేందుకు నిరంతర జ్ఞానసంపద, విశ్లేషణ, ప్రశ్నించే తత్వం ముఖ్యమని అన్నారు. క్రమశిక్షణ, నాయకత్వం, ఐక్యత, సమాజసేవ వంటి విలువలను పెంచేదిశగా స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. అలాగే కొత్త ఆలోచనలు , ఆవిష్కరణల ద్వారా జీవితంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు రేపటి భవిష్యత్ పునాదులు కాబట్టి చురుకైన ఆలోచనా విధానాన్ని అలవరచుకోవాలని, తద్వారా ఇంట్లో, పాఠశాలలో , సమాజంలో తమ చుట్టూ ఉన్న పరిస్థితులను ఎలా మెరుగుపరచవచ్చో ఆలోచించాలని ఆమె విద్యార్థులను సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు మెమెంటోలు అందించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆర్గనైజర్ , స్కౌట్ మాస్టర్ రాములు నాయక్, వివిధ పాఠశాలల స్కౌట్ మాస్టర్లు, స్కౌట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కోకరివాడి,షక్కర్‌కోటలో అధ్వానంగా రోడ్లు

కోకరి వాడిలో చెడి పోయిన రోడ్డు

చార్మినార్,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : పాతబస్తీ ఘాన్సీ బజార్ డివిజన్ పరిధిలోని కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలలో రహదారులు చెడి పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.చెడి పోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టనందున ప్రజలు నరక యాతనకు గురివుతున్నారు. వస్త్రాలు, బంగారం ఆభరణాల విక్రయాలకు ప్రసిద్ధి గాంచిన కోకరివాడి,షక్కర్‌కోటకు ప్రతీ రోజు ప్రజలు వస్తుంటారు.అసలే ఇక్కడ రహదారులు వెడల్పు దీనికి తోడు రోడ్లు గుంతలు మయంగా మారటంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలకు చెందిన వ్యాపారులు అన్ని రకాల పన్నులు సకాలంలో చెల్లిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు మాత్రం రహదారులకు మరమ్మతులు చేపట్టక పోవటం పట్ల స్థానికులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.బండిఅడ్డ నుంచి షక్కర్‌కోట,కోకరవాడి ప్రాంతాలకు రాత్రి వేళల్లో ప్రజలు ప్రయాణం చేయాలంటేనే వెనుకంజు వేస్తున్నారు.రహదారిలో రాళ్లు తేలి ఉన్నందున వాహనదారులు అదుపు తప్పి వాహనాలను అదుపు చేయలేక కింద పడిపోతున్నారు.సంవత్సరం నుంచి కోకరివాడి,షక్కర్‌కోట ప్రాంతాలలో చెడిపోయిన రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులకు ప్రజలు మొరపెట్టుకున్న పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఘాన్సీ బజార్‌లోని కోకరివాడి, షక్కర్‌కోటలోని రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అపార్ట్‌మెంట్ చోరీ కేసును ఛేదించిన బేగంపేట పోలీసులు

-ఇద్దరు నిందితుల అరెస్ట్...రూ40లక్షల విలువైన బంగారం,60వేల నగదు,మొబైల్‌ఫోన్లు స్వాధీనం

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ గోపాలకృష్ణమూర్తి

స్వాధీనం చేసుకున్న నగలు,నగదు

బేగంపేట ఫిబ్రవరి 21,ప్రభాతవార్త బేగంపేట పోలీసుస్టేషన్ పరిధిలోని శ్యాంలాల్ బిల్డింగ్‌లోని సత్యకృష్ణ సిరి సంపద అపార్ట్‌మెంట్ 302 ఫ్లాట్ లో జరిగిన చోరీ కేసును బేగంపేట పోలీసులు ఛేదించారు.ఈ కేసులో నిందితులైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు,235 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు మొబైల్ ఫోన్లు,రూ 65వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై శనివారం బేగంపేట పోలీసుస్టేషన్ లో ఏసీపీ గోపాల కృష్ణమూర్తి విలేఖరుల సమావేశం నిర్వహించి వివరాలు తెలియజేసారు.బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్ సత్యకృష్ణ సిరి సంపద అపార్ట్‌మెంట్ 302 ఫ్లాట్ లో ఎం.అనురాధ విజేంద్రనాథ్ అనే మహిళ ఒంటరిగా నివసిస్తుందన్నారు.ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం ఆమె కవాడీ గూడా లో నివసిస్తున్న తన కుమార్తె వద్దకు వెళ్లిందన్నారు.16ఉదయం ఆమె ఇంట్లో పనిచేసేందుకు వచ్చిన పనిమనిషి ఇంట్లో తాళాలు పగుల గొట్టి ఉండటం చూసి అనురాధకు సమాచారం ఇచ్చిందన్నారు.వెంటనే ఆమె ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని సుమారు 40తులాల బంగారు ఆభరణాలు,వెండి,రూ 60వేల రూపాయల నగదు దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు.ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు దర్యాప్తు ప్రారంభించారన్నారు.21వ తేదీన ఇద్దరు నిందితులు సికింద్రాబాద్ రేతిఫిల్ బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న బేగంపేట ప్రకాష్ నగర్‌లో శివపార్వతి బాయ్స్ హాస్టల్‌లో నివాసం ఉంటున్న శ్రీకాకుళం జిల్లా వరక కవిటి బోరివంక కు చెందిన బి.ప్రదీప్ (25) ,షేక్ పేట కు చెందిన ఎడ్ల ప్రవీణ్ కుమార్(32), అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసిన విషయాన్ని వెల్లడించారన్నారు.వారి వద్ద నుంచి 235గ్రాముల బంగారు ఆభరణాలు ,రెండు మొబైల్స్,రూ65000లు నగదు మొత్తం రూ40,00,000లు స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ వెల్లడించారు.నిందితులు సీసీ కెమెరాలు లేని అపార్ట్‌మెంట్ ను గుర్తించి ఈ దొంగ తనానికి పాల్పడ్డారన్నారు.వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ గోపాల కృష్ణమూర్తి మాట్లాడుతూ బేగంపేట పరిధిలో నివసించే ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు,మెయిన్ డోర్ కు సెంట్రల్ లాకింగ్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రయాణాల వివరాలను సోషల్ మీడియాలో ఎప్పుడూ పోస్ట్ చేయవద్దని హెచ్చరించారు. నేర స్థలను పట్టుకోవడంలో చాక చక్యంగా వ్యవహరించిన బేగంపేట ఇన్స్‌పెక్టర్ సైదులు, కంటోన్మెంట్ టీం ఇన్స్‌పెక్టర్ నరసింహరావు, కె.సుచ్చ దానందం,ఎస్సై శ్రావణ్ కుమార్,బేగంపేట క్రైం సిబ్బంది ని ఏసీపీ అభినందించారు.ఈ సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి తో పాటు ఇన్స్‌పెక్టర్ సైదులు ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కోరిన కాలనీ వాసులు

మా కాలనీల సమస్యలు పరిష్కరించాలని మాజీ డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డిని కోరుతున్న ప్రజల దృశ్యం.

నార్సింగి, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్షాకోట్ డివిజన్ పరిధిలో ఉన్న కేకే-2, రంగారెడ్డి కాలనీ, గణేష్ నగర్ కాలనీలకు చెందిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలని శనివారం మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా, అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యనే ఉండాలని ఎమ్మెల్యే మమ్ములను ఆదేశించారని, నిత్యం మేము ప్రజల మధ్యనే ఉంటున్నామని తెలిపారు. పిలిస్తే పలికే నాయకుడు ఎమ్మెల్యేగా ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, అర్ధరాత్రి వెళ్లి మా ఇబ్బందులు తొలగించాలని కోరినా స్పందిస్తారని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించే గుణమే ప్రకాశ్‌గౌడ్‌ను వరుసగా నాలుగుమార్లు ఎమ్మెల్యేగా గెలిపించిందన్నారు. ఆరేళ్లుగా ఎమ్మెల్యే అండతోనే ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరించామని, కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేశామని రాజేందర్‌రెడ్డి వివరించారు.

విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో రాణించాలి

అరుంధతీ సేవామండలి అదనపు అంతస్తు భవనాన్ని ప్రారంభించిన దృశ్యం

గోషామహల్,ఫిబ్రవరి 21ప్రభాతవార్త: సమాజంలో మాదిగలు గుర్తింపు పొందాలంటే విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాలల్లో రాణించాల్సిన అవసరం భాద్యత ఎంతైనా ఉందని మాజీ కార్పొరేటర్లు జి.శంకర్‌యాదవ్,బొయిని దర్శన్,సంఘ సేవకులు ఎంపి భీష్మాలు పేర్కొన్నారు.చుడీబజార్‌లోని అరుంధతీ సేవా మండలి భవనంపై అదనపు అంతస్తుపై నిర్మాణం చేపట్టిన నూతన భవానాన్ని వారు కలిసి సంఘం అధ్యక్షులు మిద్దే కృష్ణ, ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దాదాపు 60 నుంచి 70 ఏళ్లచరిత్ర కలిగిన అరుంధతి భవనంపై అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం పట్ల వారు అరుంధతి ప్రతినిధులను అభినందించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి. వెంకటేష్,చంద్రమోహన్,సభ్యులు తిరుమల్లేష్, డాన్‌సూరి, బాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్‌గా మోహన్‌కుమార్...

అఫ్జల్‌గంజ్,ఫిబ్రవరి 21ప్రభాతవార్త: శాంతి భద్రతలను కాపాడేందుగాను పోలీసులకు ప్రజలు సహకరించాలని అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా మోహన్‌కుమార్ పదవి భాద్యతలు స్వీకరించారు.ఇక్కడ విధులను నిర్వహించిన రవి సి.సి.ఎస్‌కు బదిలీ వెళ్లారు.ఆయన స్థానంలో మోహన్‌కుమార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మోహన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.శాంతిభద్రతలను కాపాడే పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, ఉస్మానియా ఆసుపత్రి వ్యాపార వాణిజ్య కేంద్రాలపై ప్రత్యేకనిఘా ఉంటుందన్నారు.అంతేకాకుండా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

-సుల్తాన్‌బజార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నరేష్

శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలు సహకరించాలని సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా జి.నరేష్ పదవి భాద్యతలు స్వీకరించారు.ఇక్కడసిఐగా కొనసాగిన కె.నర్సింహ డబీర్‌పురా పోలీస్‌స్టేషన్‌కు బదిలీవెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడేందుకుగాను ప్రజలు సహకరించాలన్నారు.రాబోయే పండుగలకు కుల మతాలకు అతీతకంగా శాంతి భద్రతలను కాపాడేందుకు సహకరించాలని ప్రజలను కోరారు .శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా కఠినంగా శిక్షించడం జరుగుతుందన్నారు.

హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన మైనంపల్లి

రోడ్డును పరిశీలిస్తున్న మైనంపల్లి

అల్వాల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా హైటెన్షన్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అధికారులను కోరారు. నాలుగున్నర కోట్లు వ్యయంతో బిబిఆర్ గార్డెన్స్ నుంచి పంచ్‌షీల్ కాలనీ వరకు రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాహన రాకపోకలకు తీవ్రమైన అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు మైనంపల్లి దృష్టికి తెచ్చారు. శనివారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్, జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ విభాగాలకు చెందిన అధికారులుతో కలిసి రోడ్డును ఆయన పరిశీలించడం జరిగింది. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణ పనులు చేపట్టే విధంగా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్ ఓపెన్ అమెచ్యూర్ గోల్ఫ్ అమూల్య

హైదరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

టీ గోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిష్టాత్మక హైదరాబాద్ ఓపెన్ అమెచ్యూర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌లో అమూల్య విన్నర్‌గా నిలిచింది. గచ్చిబౌలి బౌల్డర్‌హిల్స్‌లో శనివారం ముగిసిన 18 హోల్ చాంపియన్‌షిప్ కోర్సులో అమూల్య 148 స్కోరుతో టాప్ ప్లేస్ సొంతం చేసుకుంది. గ్రాస్ విన్నర్ గా ట్రోఫీ, రూ. 90 వేల ప్రైజ్‌మనీ అందుకుంది. శ్వేత గుళ్లపల్లి (151) ఫస్ట్ రన్నరప్‌గా, అభిషేక్ మిత్రా (152) సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. టోర్నీ ముగింపు వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారికి ట్రోఫీలు అందజేశారు. హైదరాబాద్‌ను ఇంటర్నేషనల్ గోల్ఫ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడంలో టీగోల్ఫ్ ఫౌండేషన్ కృషిని అభినందించారు. ఈ టోర్నీ రాష్ట్రంలో గోల్ఫ్ టూరిజాన్ని ప్రోత్సహించడమే కాకుండా, రైజింగ్ తెలంగాణ 2047 లక్ష్యానికి ఊతమిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయశక్తి అవసరం : కపిలవాయి దిలీప్‌కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త: జనాభాదామాషా ప్రకారం అన్ని వర్గాలకు సమాన వాటా దక్కాలంటే ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమని పలువురు వక్తలు పేర్కొన్నారు.శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో "ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి అవసరమా?" అనే అంశంపై తెలంగాణ రాజకీయ కూటమి అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా కూటమి సెక్రటరీ జనరల్ మాజీ ఎంఎల్‌సి కపిలవాయి దిలీప్ కుమార్(లోల్‌దల్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు), వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల ప్రదీప్ గౌడ్ (మహాజన సేన పార్టీ ఐధ్యక్షులు) కన్వీనర్లు రమావత్ లాలు నాయక్ (బహుజన రాజ్యం పార్టీ అధ్యక్షులుగా), కొలిశెట్టి శివకుమార్ (యుగ తులసి పార్టీ) బి. బశోక్ (ఎంటిఆర్‌ఎస్ పార్టీ), డేవిడ్ బండ్రియడ్ (ఇండియన్ సెక్యులర్ పార్టీ), మహమ్మద్ షకీల్ (ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ పార్టీ), శేషగిరి (ఆధార్ పార్టీ)లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కపిలవాయి దిలీప కుమార్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు. తెలంగాణ రాజకీయ కూటమి త్వరలో లక్ష మంది యువతతో లక్ష సైన్యం ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ పరిపాలన ఒకరి సొత్తు కాదని, పరిపాలన విభజన జరగాలని పేర్కొన్నారు. ఒక సిద్ధాంతం,నాయకత్వం కార్యాచరణతో ముందుకెళ్తే దేనైనా సాధించవచ్చన్నారు. బిసి, ఎస్సి, ఎస్టి, మైనార్టీలను సిఎంలు చేయటమే తెలంగాణ రాజకీయ కూటమి లక్ష్యమనిఆదిశగా ఉద్యమిస్తామన్నారు. ఉచిత నాణ్యమైన విద్య, వైద్య, న్యాయం ప్రజలకు అందజేయాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమం, మహిళా సాధికారత, రిజర్వేషన్లలో క్రీమీలేయర్ తప్పనిసరి చేయాలన్నారు.ఈ2సమావేశంలో ప్రొఫెసర్ లక్ష్మణ్, అడ్వకేట్ శరత్ కుమార్,జర్నలిస్టు రఘు పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్‌కుమార్, ప్రొఫెసర్ గాలివినోద్‌కుమార్ తదితరులు

సమాజాన్ని సరైన గాడిలో పెట్టాల్సింది సాహితీవేత్తలే

ముషీరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: ఎటువైపు పోతోందో తెలియని స్థితిలో ఉన్న సమాజాన్ని సరియైన దారిలో పెట్టాల్సిన బాధ్యత సాహితేవేత్తలపైనే ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం దోమలగూడలోని ఏవి కళాశాలలో తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాల ప్రారంభకు సభ తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఆనందాచారి అధ్యక్షత వహించగా, ప్రముఖ కవి, విమర్శకులు నందిని సిధారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా వాగ్గేయకారులు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ డాక్టర్ రియాజ్‌లు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మాట్లాడుతూ సాహిత్యం తెలిస్తే లోకం తెలుస్తుందని, నేటి యువత సాహిత్యాన్ని చదవాల్సిన అవసరం ఎంతో ఉందని అన్నారు. నేటి సినిమాలలో సాహిత్య ప్రాధాన్యత తగ్గిపోయి, సంగీత హోరు పెరిగిపోయిందని, వాటి మోజులోపడి, యువత గాలికి కొట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల క్రితం ప్రారంభమయిన సాహితీ సంస్థ ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లను ఎదుర్కొని, నిలబడటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ ఏనుగు నర్సింహారెడ్డి, కార్యదర్శి బాలాచారి, కేంద్ర సాహిత్య యువ పురస్కారగ్రహీత శివలింగప్ప, కళోజి అవార్డు గ్రహీత నెల్లుట్ల రమాదేవి, ప్రొఫెసర్ బన్న ఐలయ్య, ప్రముఖ కవులు యాకుబ్, వువ్వా శ్రీనివాసరావు, ఎస్.రఘు, కళాశాల ప్రిన్స్‌పాల్ సి.హెచ్.రాజలింగం పాల్గొనగా, సాహితీవేత్త సలీమ వందన సమర్పణ చేశారు.

తెలంగాణ సాహితి దశాబ్ది ఉత్సవాలను ప్రారంభిస్తున్న నందిని సిధారెడ్డి

మాదిగలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవలసిన అవసరం ఉంది : మోత్కుపల్లి నర్సింహులు

చిక్కడపల్లి ఫిబ్రవరి 21 (ప్రభాతవార్త) : తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవలసిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బంధు సొసైటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం, పాత కమిటీ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం సొసైటీ అధ్యక్షులు పల్లెల వీరస్వామి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోత్కుపల్లి నర్సింహులు హాజరై నూతన కమిటీ అధ్యక్షులుగా పల్లెల వీరస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి ఎల్లయ్య కార్యదర్శిగా మంద కనకయ్య, ఆర్గనైజర్‌గా వశపాక నరసింహ, కోశాధికారి గాపి ఆంజనేయులు, ఎగ్జిక్యూటివ్ కమిటీగా గండి కృష్ణ ఎస్ నరసింగరావు, ఎస్ సత్యనారాయణ, సి రవీంద్రా లసభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. మానకొండూరు ఎమ్మెల్యే , తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, విశ్రాంత ఐఆర్ టీఎస్ అధికారి డాక్టర్ అప్పికట్ల భరత్ భూషణ్ పాల్గొని ప్రసంగించారు. పల్లెల వీరస్వామి మాట్లాడుతూ షెడ్యూల్ కులాల కోసం కేటాయించిన సబ్ ప్లాన్ నిధులను వెంటనే విడుదల చేయాలని, విదేశాలలో చదువుల కోసం ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ కొనసాగించాలని , ఎస్సీ కార్పొరేషన్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగవలసిన అవసరం ఎంతైనా ఉందని దానికోసం మాదిగ మహాశక్తి తెలంగాణ రాష్ట్రంలో పెద్ద ఎత్తున పనిచేస్తుందని అన్నారు.

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు బంద్ సొసైటీ నూతన కమిటీ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించిన దృశ్యం

బిసిల అవకాశాలపై ప్రభుత్వ దాటవేత ఇంకెంతకాలం?

-బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్

చిక్కడపల్లి ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : బాగ్ లింగంపల్లిలోని కేంద్ర కార్యాలయంలో బీసీల బడ్జెట్, రాబోయే గ్రేటర్, పరిషత్ ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి అఖిలపక్ష సమావేశాన్ని బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ ఆధ్వర్యంలో బీసీ రాజ్యాధికార సమితి పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ తులసి శ్రీమాన్,మహిళా ముఖ్య కార్యదర్శి పోశాల సరస్వతి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.. గ్రామ పంచాయితీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలను జిల్లాల వారీగా సమీక్షించారు. దాసు సురేష్ మాట్లాడుతూ... బిసి రాజ్యాధికార సమితి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో నిర్వహించిన వందలాది కార్యక్రమాల ఫలితంగా నేడు రాష్ట్రంలో జరిగిన గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అనుకూల ఫలితాలు రావడం గొప్ప పరిణామమనీ ఈ ఫలితాలను బీసీల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న నాయకులకు అంకితవిస్తున్నామని వెల్లడించారు. మంత్రి వర్గంలో కానీ, నామినేటెడ్ పదవుల్లో కానీ, ప్రమోషన్లలో కానీ,ప్రాధాన్యత కలిగిన రంగాల్లో కానీ, బీసీల ప్రాతినిధ్యం నామమాత్రంగా ఉండటం బీసీలపై కొనసాగుతున్న వివక్షతకు నిదర్శనమని అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అనుసరించి బీసీలకు అన్ని విద్యా, ఉద్యోగ, వ్యాపార, కాంట్రాక్టర్ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను అందిస్తామన్న హామీని అపహాస్యం చేస్తున్నారు యునైటెడ్ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ వీ జీ ఆర్ నారగోని మాట్లాడుతూ రాష్ట్రంలో పెరిగిన బీసీల రాజకీయ చైతన్యం ప్రశ్నించి సాధించుకోవటమే మన ముందున్న ప్రధాన కర్తవ్యం అని అన్నారు. ప్రభుత్వం ఐదు సంవత్సరాల గాను, బీసీలకు లక్ష కోట్లు ఖర్చు చేస్తామన్నా హామీని తుంగలో తొక్కారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్ దుర్గయ్య గౌడ్, యువ నాయకులు గుండేటి శ్రీధర్, గ్రేటర్ హైదరాబాద్ మహిళా ప్రధాన కార్యదర్శి శ్రీలత, గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు మంద వెంకటస్వామి, బొమ్మ నరేందర్ మంద ఈశ్వర్ అడ్వకేట్ సుదర్శన్, జోగు శ్రీనివాస్, మల్కాజిగిరి జిల్లా బిసి రాజ్యాధికార సమితి నాయకులు శోభ, ఆనంద్, జ్యోతి, ఎల్లయ్య, మధుసూదనా చారి, పోలీస్ అధికారి రవీందర్, వడ్డేపల్లి జనార్ధన్, రంగయ్య పాల్గొన్నారు

సమావేశంలో ప్రసంగిస్తున్న బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్

ఉద్యమకారులను గుర్తించడానికి చట్టబద్ధత కలిగిన కమిటీని వేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న పాశం యాదగిరి

సైఫాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుకు ప్రభుత్వం చట్టబద్ధత కలిగిన కమిటీని తక్షణమే నియమించాలని సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి కోరారు. రాష్ట్ర మంత్రి ప్రకటనను అమలు చేసే దిశగా ప్రభుత్వం స్పష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులను గుర్తించేందుకు కమిటీ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకోవాలన్నారు. ఉద్యమకారుల అంశంపై క్యాబినేట్‌లో చర్చించి త్వరలో జివొను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వం ఉద్యమకారులు ఇళ్ల స్థలాలు, పెన్షన్, ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కమిటీ కన్వీనర్ కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్ర మ ంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. శ్రీకాంతాచారి తండ్రి వెంకటచారి మాట్లాడుతూ వందలాది మంది ఉద్యమకారుల త్యాగాల వల్లనే తెలంగాణ వచ్చిందని, ఉద్యమకారులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఉద్యమకారులు జానికిరెడ్డి, గడ్డం సదానందం, గుండమల్ల శ్రీను, కొంతం యాదిరెడ్డి, జగదీష్, మాధవి, జ్యోతి పాల్గొన్నారు.

కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన బిజెపి నేతలు

అత్తాపూర్ ఫిబ్రవరి 21, ప్రభాతవార్త : కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రాజేంద్రనగర్ లోని నారంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ లోని బిజెపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజగోపాల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి కొమురయ్య, రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పి మల్లేష్ యాదవ్, పార్టీ నాయకులు హరికిషన్, సోల్కర్ రెడ్డి, బిజెపి మహిళా మోర్చా కార్యదర్శి మేకల వనితా రెడ్డి, అత్తాపూర్ డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షులు షాబాద్ విజయ్, డివిజన్ అధ్యక్షులుసందీప్ ముదిరాజ్, సీనియర్ నాయకులు రాచూరి రాజశేఖర్,బండారి బాలకృష్ణ, రాజశేఖర్ రెడ్డి, కవిత, గౌరీదేవి, కిట్టు,వేణు గోపాల్, రాజు, మణికంఠ,ఉపేందర్ రెడ్డి,విజయ్ యాదవ్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు

నిరంతర అధ్యయనంతో విజయం స్వంతం

-ఇన్కమ్‌టాక్స్ ఐటిఏటి ఉపాధ్యక్షుడు విజయ్‌పాల్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

నిరంతర అధ్యయనంతో పాటు సబ్జెక్ట్ పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నప్పుడే జీవితంలో విజయం స్వంతం అవుతుందని హైదరాబాద్ జోన్ ఇన్కమ్‌టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్(ఐటిఏటి) వైస్ ప్రెసిడెంట్ విజయ్‌పాల్‌రావు అన్నారు. బిర్లా ప్లానిటోరియంలోని భాస్కర ఆడిటోరియంలో శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ టాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ మూట్ ట్రిబ్యునల్ పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయ్‌పాల్‌రావు మాట్లాడుతూ సిఎ, న్యాయవాది వృత్తిలో రాణించాలంటే అదృష్టం కంటే హార్డ్‌వర్క్ ముఖ్యమని అన్నారు. ఏదైనా విషయంపై పూర్తి పట్టు సాధించినప్పుడే, ఆయా విషయాల్లో గెలుపు సులభం అవుతుందని చెప్పారు. సీనియర్ల సలహాలు తీసుకుంటూ నిత్య విద్యార్థిలా మెదిలినపుడే వృత్తిలో నైపుణ్యం సాధించి, జీవితాంతం వృత్తిలో రాణించగలమన్నారు. న్యాయమూర్తి ముందు వాదనలు వినిపించే సమయంలో ఎదుటి వ్యక్తి సంధించే ప్రశ్నలకు తమదైన శైలిలో విషయ పరిజ్ఞానంతో బదులు చెప్పినప్పుడే విజయం సాధించవచ్చని విజయ్‌పాల్‌రావు తెలిపారు. తెలంగాణ, ఏపి టాక్స్ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు సిఎ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ మూట్ ట్రిబ్యునల్ కాంపిటీషన్ కార్యక్రమం యువ చార్టెర్డ్ అకౌంటెంట్స్, న్యాయవాదులు తమ వృత్తి పట్ల అవగాహన పెంపొందించుకునేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి యువ చార్టెర్డ్ అకౌంటెంట్స్(సిఎ), న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరై, మూట్ ట్రిబ్యునల్ పోటీల్లో పాల్గొని తమ తమ వృత్తిలో ఉండే విషయాలపై చర్చించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి టాక్స్ బార్ అసోసియేషన్ బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఐటిఏటి హైదరాబాద్ బెంచ్ అకౌంట్ మెంబర్లు మంజునాథ జి, మధుసూధన్ సవిదా, జ్యూడిషియల్ మెంబర్ రావిష్ సూద్ హాజరయ్యారు. అలాగే మూట్ ట్రిబ్యునల్ పోటీల న్యాయ నిర్ణేతలుగా ఐటిఏటి హైదరాబాద్ జోన్ ఉపాధ్యక్షుడు డి. మన్మోహన్, ఐటిఏటి మాజీ అకౌంట్ మెంబర్ బి.రామకోటయ్య, అసోసియేషన్ కార్యదర్శి అశిష్ జోషి, కోశాధికారి సోమశేఖర్ నెమ్మని, చైర్మన్ అమ్రిత్ కుమార్ కోట, కన్వీనర్ పంకజ్ సంచేటి, కో కన్వీనర్లు లీల కృష్ణమోహన్ కోట, ప్రవళిక వేముల వ్యవహరించారు.

మూట్ ట్రిబ్యునల్ పోటీల కార్యక్రమం నుద్దేశించి మాట్లాడుతున్న ఇన్కమ్‌టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్(ఐటిఏటి) వైస్ ప్రెసిడెంట్ విజయ్‌పాల్‌రావు

అమ్మ భాషను మరవొద్దు, అమ్మ నాన్న అనే పిలుపులోనే కమ్మదనం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఎన్ని భాషలు నేర్చినా అమ్మ భాషను మరవొద్దని ప్రముఖ పాత్రికేయులు, బాల సాహిత్య కవి, రచయిత తిరునగరి వేదాంతసూరి బాలలకు ఉద్బోధించారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుమలగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్వహించిన వేడుకలల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అమ్మ అనే పిలుపులోనే కమ్మదనం ఉందని, ప్రతి విద్యార్థి మమ్మి, డాడి కాకుండా అమ్మ నాన్న అనే పిలుపును అలవాటు చేసుకోవాలని సూచించారు. మన దేశంలో లేని అభిమానం పరాయి దేశంలో లభిస్తున్నదని, విదేశాల్లో మన భాష వినిపిస్తే ఆ ఆనందం మాటల్లో చెప్పలేమని, ప్రతి విద్యార్థి తెలుగు భాష పట్ల మక్కువ కలిగి ఉండాలని, మీకు తోచిన కథ కవిత వ్యాసం ఏదైనా రాసే ప్రయత్నం చేయాలని చెప్పారు. తాను నిర్వహించే 'మొలక' అంతర్జాల పత్రిక మీ రచనలకు వేదిక అని చెప్పారు. పాఠశాల ప్రధానోధ్యాయులు భరద్వాజ మాట్లాడుతూ మాతృభాషపై మమకారం వదలవద్దని అమ్మ ప్రేమలాంటిదే మాతృభాష అని, ఆంగ్లం చేర్చుకోవడం తప్పనిసరి అయినప్పటికి మాతృభాషను మాత్రం చులకన చేయరాదని తప్పకుండా గౌరవించాలని సూచించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు డా. కృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని గోప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, పద్య పఠన పోటీ, కథల పోటీలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో కొనసాగాయి. 50 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సహంగా పాల్గొనగా విజేతలకు ముఖ్యఅతిథి బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిని ప్రధానోపాధ్యాయులు పుష్పమాల, శాలువతో ఘనంగా సత

శివాజీ మహారాజ్ స్ఫూర్తితో మార్మోగిన మాధవీ నగర్

శోభాయాత్రలో కంచి మహేందర్ సందేశం



ఛత్రపతి శివాజీ జయంతి వేడుకల్లో పాల్గొన్న మహేందర్

మూసాపేట్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

స్వరాజ్య స్థాపకుడు, అపార ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా శనివారం మాధవీ నగర్‌లో యువత ఉత్సాహం నడుమ అట్టహాసంగా శోభాయాత్ర నిర్వహించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు కంచి మహేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని యువతకు స్ఫూర్తిదాయక సందేశం అందించారు. ఈ సందర్భంగా కంచి మహేందర్ మాట్లాడుతూ శివాజీ మహారాజ్ జీవితం దేశభక్తి, ధర్మరక్షణ, స్వాభిమానం, పరిపాలనా నైపుణ్యాలకు చిరస్మరణీయ నిదర్శనమని పేర్కొన్నారు. యువత, ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. శివాజీ మహారాజ్ చూపిన స్వరాజ్య మార్గం నేటి తరానికి కూడా దిశానిర్దేశం చేస్తుందని ఆయన అన్నారు. శోభాయాత్రలో యువత భారీ సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో ప్రాంతాన్ని మార్మోగించారు. శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాన్ని అసోసియేషన్ స భ్యులు రాజు, కిరణ్, నరేష్, మణికంఠ ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించారు.

పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి : ఇన్స్‌పెక్టర్ వెంకట్ రెడ్డి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త :

పండుగలను శాంతియుత వాతావరణంలో, పరస్పర సమన్వయంతో జరుపుకోవాలని ఖైరతాబాద్ ఇన్స్‌పెక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో మూడు సెక్టార్లు పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెంకటరమణ కాలనీ, నవీన్ నగర్, ఆనంద్ నగర్ ప్రాంతాలకు ఎస్ఐ సందీప్ రెడ్డి, చింతల్ బస్తీ, తుమ్మల బస్తీ ప్రాంతాలకు ఎస్ఐ రమణ, ఖైరతాబాద్ పరిసర ప్రాంతాలకు ఎస్ఐ సమీర్, అడ్మిన్ విధులకు రమణ బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెప్పారు. వీరితో పాటు సుమారు 80 మంది సిబ్బంది సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల స్టేషన్‌కు ఐఎస్ఓ సర్టిఫికేషన్, ప్రజావాణి, నగర కమిషనర్ నుంచి మూడు అవార్డులు లభించాయని తెలిపారు. ఈ విజయాలకు ప్రజల సహకారం, సిబ్బంది కృషి కారణమని అన్నారు. ముఖ్యంగా స్వగ్రామాలకు వెళ్లే వారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 8712 665185 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేరాలను నివారించడానికి ప్రజల సహకారం అవసరం : సిఐ రామకృష్ణ



సీఐని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:

నేరాలను నివారించడానికి కేవలం పోలీసులు పనితీరు సరిపోదని, పౌరుల సహకారం అవసరం ఉంటుందని చిలకలగూడ ఎస్ఏహెచ్ వలిశెట్టి రామకృష్ణ తెలిపారు. సీతాఫలండికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎస్సీఓను మర్యాదపూర్వకంగా కిలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ నేరాలను అరికట్టాలన్నా, ఛేదించాలన్నా పౌరులు ఇచ్చే సమాచారం ఎంతో కీలకంగా ఉంటుందని అన్నారు. ప్రతీ వ్యక్తి సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించినప్పుడే అది సాధ్యమవుతుందని చెప్పారు. చాలా మంది చూసిన నేరాన్ని పోలీసులకు చెప్పడానికి ఇష్టపడరని, ఈ తరుణంలో నేరాన్ని ఛేదించాలంటే సమయం, ప్రయాస ఎక్కువగా ఉంటుందని అన్నారు. పౌరులు చైతన్యవంతులయితే తప్ప ఇలాంటి సమస్యలు పరిష్కారం కావని, ఇందుకోసం తరచుగా అవగాహనా కార్యక్రమాలు జరుపనున్నట్లు తెలిపారు. సమాచారం ఇచ్చినవారి పేర్లను గోప్యంగా ఉంచుతామని, వారికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని వలిశెట్టి రామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు గరికపోగుల చంద్రశేఖర్, మహాత్మవారి, నవీన్ చారి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కులస్తులకు బాసటగా నిలుస్తాం : పద్మారావు గౌడ్

ఎమ్మెల్యే పద్మారావును కలిసిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఆర్య వైశ్య కులస్తులకు బాసటగా నిలుస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. లాలాపేట ఆర్య వైశ్య సంఘం నేతల ప్రతినిధుల బృందం శనివారం సితఫలమండీలో ఎం.ఎల్.ఏ.క్యాంపు కార్యాలయంలో పద్మారావు గౌడ్‌తో సమావేశమైంది. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని లాలాపేటలో త్వరలో నిర్మిస్తున్నట్లు నేతలు తెలిపారు. తమ సంఘం కార్యకలాపాలకు తగిన మద్దతుగా నిలవాలని కోరారు. ఆలయం నిర్మాణం సంతోషకరమని, వారికి బాసటగా నిలుస్తామని పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సంఘం అధ్యక్షులు మడి పడగ శ్రీనివాస్, ఆర్య వైశ్య సంఘం నాయకులు రాములు గుప్త, వెంకటేశం, వీరభద్రయ్య, రమేష్ లతో పాటు బీ.ఆర్.ఎస్. నేతలు నాగేశ్వర్ రావు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కెపిహెచ్‌బి కాలనీ పద్మావతి ప్లాజా మొబైల్ షాప్‌లో అగ్నిప్రమాదం

కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ మెయిన్ రోడ్డులో గల పద్మావతి ప్లాజాలో శనివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్లాజాలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో గల శ్రీ సాయి కమ్యూనికేషన్స్ మొబైల్ షాప్‌లో విద్యుత్ ఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోనికి తీసుకు వచ్చారు. షాపులో విలువైన మొబైల్ ఫోన్స్ అగ్నికి ఆహుతి అయినట్లు పోలీసులు తెలిపారు.

అగ్ని ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు : డాక్టర్ కోట నీలిమ

సంజీవరెడ్డి నగర్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త:

వేసవి ఎండలు పెరిగాయని ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువని, వాటి నివారణకు అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని పీసీసీ వైస్ ప్రెసిడెంట్, సనత్ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ అన్నారు. తాజాగా అమీర్‌పేట్ మైత్రివనంలోని ఓ భవనంలో అగ్ని ప్రమాదం జరిగిన నేపథ్యంలో ఆమె స్థానిక కోచింగ్ సెంటర్ యజమానులు, హోటల్ నిర్వాహకులు, అద్దెదారులు, హైడ్రా, ఫైర్, సేఫ్టీ అధికారులు, వివిధ అసోసియేషన్ల నేతలతో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ నిబంధనలు పాటించకుండా, నివారణ చర్యలపై దృష్టి పెట్టకపోవడంతో అగ్నిప్రమాద ఘటనలు పెరుగుతున్నాయన్నారు. విద్యుత్ సరఫరాలో లోపాలను గుర్తించకపోవడం, ఫైర్ ఆడిట్ నిర్వహించకపోవడంతోపాటు మానవ తప్పిదాలు ఇందుకు కారణమవుతున్నాయన్నారు. ఎత్తయిన భవన నిర్మాణాలకు స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి నుంచి అనుమతి తప్పనిసరి తీసుకోవాలన్నారు. హైడ్రెంట్లు, ఫైర్ ఎగ్జిట్లు, స్ప్రింక్లర్లు, పంప్ రూమ్ వంటివి భారీ భవన సముదాయాల్లో ఏర్పాటు చేయాలన్నారు. మూడు నెలల

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కోట నీలిమ

కోసారి ఫైర్ డ్రిల్స్ నిర్వహించాలని అధికారులను కోరారు. విద్యుత్ మరమ్మతులు క్వాలిఫైడ్ ఎలక్ట్రిషియన్‌తో మాత్రమే చేయించాలని, అతుకులు కలిగిన తీగలు, లూజ్ వైరింగ్ ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్యుత్ ద్వారా నడిచే రిఫ్రిజిరేటర్లు, ఓవెన్‌ను గాలి, వెలుతురు బాగా వచ్చే చోట ఉంచాలని, అధిక ఓల్టేజీ ఉన్న ఉపకరణాలకు ఎర్తింగ్ ఉన్న పిన్ సాకెట్లను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సుజాత, ఎస్ఆర్ నగర్ ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్ రెడ్డి, హైడ్రా అధికారి మోహన్ రావు, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ మహేష్, బిల్డింగ్ మేనేజ్ మెంట్, వివిధ అసోసియేషన్ల నేతలు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాచుపల్లి పెద్ద చెరువులో మురికినీరు కలవకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి : ఆకుల సతీష్

నిజాంపేట్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని బాచుపల్లి గ్రామంలో సుమారు 42 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన అతిపెద్ద మంచినీటి వనరైన భైరవాన్ కుంట (పెద్ద చెరువు) గత వారం రోజులుగా తీవ్ర కాలుష్యానికి గురవుతోందని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ కోరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంద్రానగర్, రెడ్డి స్లాబ్, ఎస్‌విఎస్ఆర్ వన్, కేజీఎం కాలనీల నుంచి వచ్చే నాలుగు డ్రైనేజ్ మాన్యువల్స్ పగిలిపోవడంతో మురికి నీరు నేరుగా చెరువులోకి చేరుతోందని, దీంతో మంచినీటి చెరువు క్రమంగా మురికినీటి చెరువుగా మారుతోందన్నారు. ఈ విషయంపై గత పది రోజులుగా మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమని అన్నారు. మురికినీరు చెరువులో కలవడం వల్ల భూగర్భ జలాలు కాలుష్యం చెందే ప్రమాదం ఉందని, చెరువు పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, దోమల పెరుగుదల వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. హిందువుల పవిత్రమైన వినాయక నిమర్జనం జరిగే ఈ ఏకైక మంచినీటి చెరువు కలుషితం

కావడం బాధాకరమన్నారు. ప్రస్తుత పరిస్థితిపై నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు నిరక్ష్యం వహిస్తున్నారని ఆకుల సతీష్ ఆరోపించారు. తక్షణమే డ్రైనేజ్ మాన్యువల్స్ మరమ్మతు చేసి మురికి నీరు చెరువులోకి చేరకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అలాగే కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు మాన్యువల్స్‌ను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేస్తున్నారని సమాచారం ఉన్నందున చెరువు పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి బాచుపల్లి పెద్ద చెరువును పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరు కంటి చూపు పట్ల జాగ్రత్తలు వహించాలి

గణేష్‌నగర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న పిక్సెల్ కంటి ఆస్పత్రి వైద్యులు.

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :

ఎప్పటికప్పుడు కంటి సమస్యలపై తగిన విధంగా వైద్య పరీక్షలు నిర్వహించుకుని మెరుగైన కంటి చూపు ఉండేలా చూసుకోవాలని గణేష్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గణేష్‌నగర్ బస్తీలో వినాయక దేవాలయం వద్ద పిక్సెల్ ఐ ఆస్పత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బస్తీలోని చిన్నారులు, యువత, వృద్ధులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పరీక్షలు నిర్వహించుకోగా అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

సమాజ సేవలో ఆశావర్కర్ల పాత్ర కీలకం : ఎమ్మెల్యే శ్రీగణేష్

ఆశా వర్కర్లతో సమావేశమైన ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త:

సమాజ సేవలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమైందని కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారం బాలంరాయిలోని లీ ప్యాలెస్‌లో నిర్వహించిన ఆశా వర్కర్ల సమస్యలు, వారి తీరుపై నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కరోనా సమయంలో ఆశా వర్కర్లు తమ ప్రాణాలను లెక్క చేయకుండా ఎన్నోసేవలు అందించారన్నారు. దేశ సైనికులు దేశానికి ఎంత సేవ చేస్తారో అదే మాదిరిగా ప్రజల ఆరోగ్యం పట్ల ఆశా వర్కర్ల సేవలు అమోఘమన్నారు. ఆశా వర్కర్ల సంక్షేమం కోసం సిఎం రేవంత్ రెడ్డి,ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కలు ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

మోండా డివిజన్‌లో నేటి నుంచి గడప గడపకు కాంగ్రెస్ : సంతోష్ యాదవ్

శివాజీ నగర్ పెరుమాల్ దేవాలయం వద్ద గడప గడపకు కాంగ్రెస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నేత సంతోష్ యాదవ్

అడ్డగుట్ట,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ సహకారంతో మోండా డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి,ప్రభుత్వ సంక్షేమ పథకాలపై నేటి నుంచి ప్రతి ఆదివారం గడపగడపకు కాంగ్రెస్ అనే నినాదంతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తెలిపారు. శనివారం శివాజీ నగర్‌లోని శ్రీవెంకటేశ్వర పెరుమాల్ దేవాలయంలో గడపగడపకు కాంగ్రెస్ అభివృద్ధే మాద్యేయం,ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం అనే నినాదంతో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. గత 2 సంవత్సరాల నుంచి ఎమ్మెల్యే శ్రీగణేష్ నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటూ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని స్థానాలను కైవసం చేసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మోండా డివిజన్‌లో విస్తృత ప్రచారాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని సంతోష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఆర్.డి. నాగేశ్ యాదవ్, దేవేందర్,మల్లేశ్, రాజు,బాబురావ్, ఉమా శంకర్,హరి, డి.బాబుయాదవ్, సాల్మన్,ప్రతీక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సింది ఉపాధ్యాయులే

పీటీఎంలో ప్రసంగిస్తున్న డిప్యూటీ ఐఓఎస్ వెంకటరెడ్డి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :

విద్యార్థుల యొక్క భవిష్యత్ తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల మీదే ఆధారపడి ఉంటుందని బహదూర్‌పురా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ వెంకట్ రెడ్డి అన్నారు. శనివారం దారుల్‌షిఫా ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల (పీటీఎం) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ యొక్క పిల్లలని ప్రతిరోజు పాఠశాలకు పంపించాలన్నారు. అపుడే తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే విషయాలు చక్కగా అర్థం చేసుకొని చదువులో రాణిస్తారన్నారు. గణితంలో చతుర్విధ ప్రక్రియలు నేర్చుకొని స్వయంగా రాత లెక్కలు చేసేలా ఉపాధ్యాయులు వారికి తగిన విధంగా బోధించాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకటరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు పాఠశాలకు పంపించాలని కోరారు. అప్పుడే విద్యార్థులు చదువులో వెనుకబడరని వివరించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు అమ్జద్ ఖాన్, రవి కాంత్, రవీందర్ రెడ్డి, జానయ్య, మలీహ, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావుకు సిపిఐ సన్మానం

ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు, డిఐ కృష్ణమూర్తి నాయుడును సన్మానిస్తున్న చంద్రమోహన్‌గౌడ్

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త :

ఛత్రినాక పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్.కోటేశ్వర్‌రావును, అదనపు ఇన్‌స్పెక్టర్ ఆర్.కృష్ణమూర్తి నాయుడును భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డమీది చంద్రమోహన్ గౌడ్ కలిసి అభినందనలు తెలియజేశారు. వారిని శాలువ, మొక్కతో సన్మానించి జన చంద్రోదయం పాటల పుస్తకాన్ని బహూకరించారు. గౌలిపురా డివిజన్ పరిధిలో శాంతి భద్రతలు, అసాంఘిక కార్యకలాపాలు, బార్లు, రెస్టారెంట్ల వద్ద ప్రధాన రోడ్లపై విచ్చలవిడిగా వాహనాల పార్కింగ్ తదితర విషయాలను ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. శాంతిభద్రల పరిరక్షణకు పార్టీ తరపున సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

జగద్గిరిగుట్ట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. శనివారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ రాజీవ్ గృహకల్ప వద్ద గల సంస్కృతి హై స్కూల్ నందు మల్లారెడ్డి హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు అత్యధికంగా నివసించే జగద్గిరిగుట్ట ప్రాంతంలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న సంస్కృతి హై స్కూల్ యాజమాన్యానికి, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృందానికి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ (నార్త్) సభ్యులకు అభినందనలు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ గడ్డమీది బాల్ రాజ్, కార్పొరేటర్ జగన్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, సీనియర్ నాయకులు ఆజం, మెట్ల శ్రీను, త్రివేణి, లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బి.ఆంజ నేయులు, చల్లా శ్రీనివాస్ రెడ్డి, వినోద్ జాదవ్, సిహెచ్.నరసింహులు, ఎస్. ఆర్. భాషా, మల్లారెడ్డి హాస్పిటల్ డాక్టర్ల బృంధం పాల్గొన్నారు.

మాలలకు జరిగిన అన్యాయాలపై మంత్రి వర్గ సమావేశంలో చర్చించాలి

సైఫాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వల్ల మాలలకు తీరని అన్యాయం జరిగిందని, సోమవారం జరిగే రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో వర్గీకరణ బిల్లును పున:సమీక్షించాలని, కాంగ్రెస్ పార్టీ చేసిన చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ఎస్సీ రిజర్వేషన్‌లను 15 శాతం నుంచి 22 శాతంకు పెంచాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జెఎసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి ఛైర్మన్ మందాల భాస్కర్, గౌరవ అధ్యక్షుడు చెరుకు సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ ఛైర్మన్ బేర బాలకిషన్ మాట్లాడుతూ వర్గీకరణలో రోస్టర్ విధానాన్ని సవరించి 20 లోపు రెండు రోస్టర్ పాయింట్లను కల్పించాలని కోరారు. రిజర్వేషన్‌ల విషయంలో మాలలకు తీరని అన్యాయం జరుగుతుంటే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, మాల ఎమ్మెల్యేలు నోరుమెదపకపోవడం సిగ్గు చేటని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా చేసిన వర్గీకరణ వల్ల మాలలకు విద్యా, ఉద్యోగ రంగాలలో తీరని అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న మందాల భాస్కర్. చిత్రంలో చెరుకు సుధాకర్, బేర బాలకిషన్ తదితరులు

జరిగిందని, రేవంత్‌రెడ్డి మాలలపై కక్షగట్టి రిజర్వేషన్‌లను లేకుండా చేసిన తీరును ప్రజా క్షేత్రంలోకి తీసుకువెళ్ళి తెల్పుకుంటామని హెచ్చరించారు. మంత్ర వర్గ సమావేశంలో మాలలకు జరిగిన అన్యాయాలపై చర్చించకపోతే 'కాంగ్రెస్ పార్టీ అంతం-మాలల పంతం' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు. మాలలకు జరిగిన అన్యాయాలపై ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీలు బిఆర్ఎస్, బిజెపి, ఎంఐఎం, సిపిఐ తదతర పార్టీలు ప్రభుత్వాన్ని నీలదీయాలని కోరారు.

పేదల ఇండ్ల పట్టాలతో ధనికుల అక్రమ నిర్మాణాలు : బిక్షపతి యాదవ్

నిజాంపేట్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త

బాచుపల్లి మండలం పరిధిలో పేదల పేరుతో కేటాయించిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలపై బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని భారతీయ జనతా పార్టీ నిజాంపేట అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ శనివారం ఆరోపించారు. జిహెచ్ఎంసి నిజాంపేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇచ్చి భవనాలు సీజ్ చేశామని చెబుతున్నప్పటికీ, అనేక కాలనీలలో అక్రమ కట్టడాలు యథావిధిగా కొనసాగుతున్నాయని విమర్శించారు. రాజకీయ మద్దతుతో బిల్డర్లు నిర్మాణాలు పూర్తి చేసి అమాయక ప్రజలకు లక్షల్లో విక్రయిస్తున్నారని అన్నారు. బాచుపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్లు 82, 83, 334, 343, 344, 346, 191, 348, 186, 233/26, 290, 293, 319 తదితర ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు పెరుగుతున్నాయని తెలిపారు. చిన్న ప్లాట్లుగా విభజించి, జీఓ 58, 59 కింద రెగ్యులరైజ్ చేసుకున్నామని చూపిస్తూ కోర్టు ఉత్తర్వులు తెచ్చుకోవడం సర్వసాధారణమైందని ఆరోపించారు. పార్కులు, మార్కెట్ యార్డ్ స్థలాలు, చెరువులు, నాళాలు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, కొంతమంది ప్రజాప్రతినిధుల సహకారం ఉన్నందునే ఈ పరిస్థితి నెలకొన్నదని అన్నారు. అర్హులైన పేదలకు చెందిన పట్టాలను మినహాయించి, మిగతా అక్రమ కట్టడాలను వెంటనే కూల్చివేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు ధృవపత్రాలతో ప్రభుత్వ భూముల్లో ఉన్నవారిపై కేసులు నమోదు చేయాలని కోరారు. లేకపోతే జీఓ కాపీలతో ప్రతి సర్వే నంబర్‌ను పరిశీలిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో డోర్ టు డోర్ పరిశీలన చేపడతామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించాలంటే కఠిన చర్యలే మార్గమని బిక్షపతి యాదవ్ స్పష్టం చేశారు.

గంగారం చెరువు పరిశుభ్రం చేయండి

: బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కసిరెడ్డి సింధూరెడ్డి

గంగారం చెరువు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

శేరిలింగంపల్లి,ఫిబ్రవరి 21 ప్రభాతవార్త

గంగారం పెద్దచెరువును పరిశుభ్రం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, చందానగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కసిరెడ్డి సింధూరెడ్డి డిమాండ్ చేశారు. చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పెద్ద చెరువు దోమలకు అవాసమై చుట్టుపక్కల ప్రజలు ఆనారోగ్య సమస్యలపై సతమతమవటంతో బీజేపీ రాష్ట్ర నేత, చందానగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ కసిరెడ్డి సింధూరెడ్డి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సిందూరెడ

డాక్టరేట్ అందుకున్న కిన్నెర మొగులయ్యకు సన్మానం

కిన్నెర మొగులయ్యను సన్మానిస్తున్న సి.ఐ. మహేష్ గౌడ్.

వనస్థలిపురం ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: తెలంగాణ సంస్కృతిలో అరుదైన కళగా పేరొందిన 12 మెట్ల కిన్నెర గానాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప కళాకారుడు పద్మశ్రీ దర్శనం మొగులయ్య అని వనస్థలిపురం పోలీస్ ఇన్‌స్పెక్టర్ టి. మహేశ్ అన్నారు. అంతరించి పోతున్న కళను తన ప్రదర్శనల ద్వారా వెలుగులోకి తెచ్చిన మొగులయ్యకు ఇటీవల చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం వనస్థలిపురం పీఎస్‌కు వచ్చి ఇన్‌స్పెక్టర్ మహేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీఐ మొగులయ్యను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. కళారంగంలో వారి కృషి రాష్ట్రానికి , దేశానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని ఇన్‌స్పెక్టర్ టి. మహేశ్ ప్రశంసించారు.

సిఎం సహాయనిధి ద్వారా పేదలకు మేలు : ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి ఎల్ఓసి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.

వనస్థలిపురం. ఫిబ్రవరి.21.ప్రభాతవార్త సీఎంరిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ది చేకూరుతుందని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి అన్నారు. హస్తినపురం డివిజన్ పరిధిలోని భాగ్యనగర్ కాలనీ కి చెందిన సత్యనారాయణ భార్య ఆరోగ్య సమస్యలతో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వారు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయనిదికి కింద 2లక్షల పదివేల రూపాయలను మంజూరు చేయించి చెక్కు అందజేశారు.సందర్భంగా సుదీర్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహద పడుతుంది అని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిది అండగా ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు ఓరుగంటి వెంకటేష్,చంద్రశేఖర్ రెడ్డి,మల్లేశ్ గౌడ్,పులివెంకట్, పాండు,చందు యాదవ్ పాల్గొన్నారు.

ధమ్మయాత్రకు బీఎస్ఐ ఘన స్వాగతం

శాంతి సందేశాన్ని ఇస్తున్న బౌద్ధ భిక్షువులు, బాలాజీ గైక్వాడ్

మన్సూరాబాద్, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ బౌద్ధ బిక్షువులు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా కాలబుర్గి బౌద్ధ క్షేత్రం నుంచి తెలంగాణ నాగార్జునసాగర్ లో ఉన్న బుద్ధవనం వరకు చేపట్టిన బౌద్ధ ధమ్మయాత్ర3 శనివారం మధ్యాహ్నం ఎల్బీనగర్ కు చేరుకుంది. ఈ సందర్భంగా బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా(బీఎస్ఐ) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలాజీ గైక్వాడ్ ఆధ్వర్యంలో బీఎస్ఐ సభ్యులు బౌద్ధ భిక్షువులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బౌద్ధ బిక్షువులు, బీఎస్ఐ సభ్యులతో కలిసి బీఎస్ఐ సంఘ్ డైరెక్టర్ పారా సాంక్షక్ కొవిడ్ ఎల్బీనగర్ లోగల డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి శాంతి సం దేశాన్చార్చారు. అనంతరం బాలాజీ గైక్వాడ్ మాట్లాడుతూ ఈ నెల ఫిబ్రవరి 2 నుంచి మార్చి 3వ తేదీ వరకు నెల రోజుల పాటు చేపట్టిన ధమ్మయాత్ర ప్రపంచ శాంతి, ప్రజల సుఖసంతోషాలను కోరుతూ సాగుతుందని, 423 కిలోమీటర్ల మేరకు సాగే ఈ పాద యాత్ర లో సుమారు 80 మంది థాయిలాండ్ మరియు ఇండియా దేశాలకు చెందిన బౌద్ధ సన్యాసులు ఉన్నారన్నారు. ఈ యాత్రకు స్వాగతం పలికిన వారిలో బీఎస్ఐ రాష్ట్ర అధ్యక్షుడు పరంధాములు, నూకల నర్సింహా, నర్సింగ్ రావు, కార్యనిర్వాహక కార్యదర్శి బాలాజీ గైక్వాడ్, సునీల్, వెంకటేశ్వర్లు, కొంగరి నరసింహరావు, మేకల సత్యనారాయణ, శివశంకర్, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు కాలనీలో రూ.12 లక్షల నిధులతో రహదారి నిర్మాణం : ప్రేమ్ కుమార్

బ్యాంకు కాలనీలో రహదారి సమస్యను పరిష్కరించినందుకు కార్పొరేటర్ సన్మానించిన కాలనీవాసులు

మల్కాజిగిరి ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: ఈస్ట్ ఆనంద్ బాగ డివిజన్ లోని బ్యాంకు కాలనీలో 12 లక్షల రూపాయల నిధులతో రహదారి సౌకర్యాన్ని కల్పించిన మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న రోడ్డు సమస్యను ప్రేమ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే రోడ్డును మంజూరు చేయించి 12 లక్షల నిధులను కేటాయించి రోడ్డును వేయించడం జరిగింది అన్నారు. కాలనీలో ట్రాన్స్ ఫార్మర్ కు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, వీధి దీపాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.వెంటనే వెంటనే అధికారులకు ఫోన్ చేస్తా సమస్యలను పరిష్కరించాలని కోరారు. బ్యాంక్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కృష్ణస్వామి జయపాల్ శంకర్రావు నాగేశ్వరరావు మోహన్ సోమేశ్వరరావు శ్రీనివాస్ చంద్రకాంత్ వెంకటేశ్వరరావు ఆనంద్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ బాబు సంపత్ రావు కిషోర్ తదితరులు పాల్గొన్నారు

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

మలక్ పేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) ప్రతిమా సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్‌గా కొన సాగిన ప్రతిమా సింగ్ ప్ర సూతి సెలవులపై వెళ్లిన విషయం విదితమే. కాగా శుక్రవారం నాడు తిరిగి అదనపు కలెక్టర్ గా (స్థానిక సంస్థలు) ఆమె బాధ్య తలు స్వీకరించారు

అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్

మార్కెట్లలో మౌలిక సదుపాయాలను కల్పించడానికి కృషి : చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి

మలక్ పేట, ఫిబ్రవరి 21, ప్రభాతవార్త: హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లలో మౌలిక సదుపాయాలను కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకార్ లక్ష్మి పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కమిటీ కార్యాలయంలోమార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ సభ్యులు అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీలో కొనసాగుతున్న , చేపట్టవలసిన అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్లలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా మార్కెట్ యార్డ్‌లోని అంతర్గత రహదారుల మరమ్మతులు చేయడం, నూతన సీసీ రోడ్లు వేయడం వంటి అంశాలపై సమీక్షించి, తగు చర్యలు తీసుకోవాలని నిర్ణయించడం జరిగిందని వివరించారు.అదేవిధంగా, రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులకు చల్లని త్రాగునీటి (కూల్ వాటర్) సరఫరా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదించి ప్రభుత్వానికి పంపించాలని తీర్మానించామని తెలిపారు. మార్కెట్ యార్డ్‌లలోని కొన్ని ప్రాంతాలలో వీధి దీపాలు, షెడ్లలో లైట్లు లేకపోవడంతో, సుమారు రూ.15 లక్షల వ్యయంతో

మార్కెట్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్మన్ చెకోలేకార్ లక్ష్మి ఫొటో చిత్రంలో వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, ఇంచార్జ్ ఎస్టీఎస్ చిలక నర్సింహారెడ్డి తదితరులు

లైట్లు మరమ్మతులు, కొత్త లైట్లు ఏర్పాటు చేయడానికి సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని అన్ని మార్కెట్లను ఆధునీకరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కోట్లా శ్రీనివాస్, ఇంచార్జ్ ఎస్జిఎస్ చిలక నరసింహారెడ్డి, కమిటీ సభ్యులు నేలపాటి రామారావు, పన్నాల రాజేందర్ రెడ్డి, మహ్మద్ షకీల్, ఎస్.యు. ప్రత్యూష, బుద్ధ సత్యనారాయణ, మస్రాత్ సుల్తానా, పాశం అశోక్ గౌడ్, కనకాల శివాజీ, పి. కిషన్ సింగ్. ఎం. సాయిరాం, దుగ్గ జగదీష్, మాదారం కృష్ణ, అధికారులు పుష్ప, మాధురి, సూపర్వైజర్ పవన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మైనార్టీలకు సంక్షేమ పథకాలు : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి ఫిబ్రవరి 21,ప్రభాతవార్త : కాంగ్రెస్ ప్రభుత్వ హయములు ముస్లిం మైనార్టీల కోసం ఇందిరమ్మ మైనార్టీ మహిళ యోజన స్కీమ్ ప్రవేశపెట్టినట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు. శనివారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని దయానంద్ నగర్ లో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ మైనార్టీ మహిళ యోజనస్కీం పథకం కింద లబ్ధిదారులకు 50 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందన్నారు. మైనార్టీలకు వెనుకబడిన తరగతులకు దూదేకుల వర్గాలకు ద్విచక్ర వాహనాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఆలూరు లబ్ధిదారులకు లక్ష రూపాయలు ద్విచక్ర వాహనాలను అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద బడుగు బలహీన వర్గాలు సంక్షేమం కోసం ఆర్నిశలు పాటుపడుతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ

ఇందిరమ్మమైనార్టీ యువజన స్కీం కింద లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

సంక్షేమ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు . ఈ సందర్భంగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ జితేంద్రనాథ్ బి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ నాయకులు గుండా నిరంజన్, జి ఎన్ వి సతీష్ కుమార్ హరి యూసుఫ్ ప్రవీణ్ రాందాస్ సంతోష్ పీవీ సత్యనారాయణ రామచందర్, నాగరాజు సిరిగిరి రాజు వేణు నాయుడు ఆశ పుష్పలత కన్నా ప్రసాదు యాదవ్ శంకర్ ప్రవీణ్ పాల్గొన్నారు

ఆధ్యాత్మిక కేంద్రం..లక్ష్మినగర్ షిర్డీసాయి మందిరం

-నేటి నుంచి ఐదు రోజుల పాటు వార్షిక బ్రహోత్సవాలు

సైదాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మినగర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరం ఆధ్యాత్మిక కేంద్రంగా, పిలిస్తే పలికే సాయి మందిరంగా దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతుంది. లక్ష్మినగర్ షిర్డీసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఈ మందిరం నిర్వాహణ కొనసాగుతుంది. సేవా సమితి ఆధ్ వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా దేవాలయంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ స్థానికుల మన్ననలు అందుకుంటున్నారు. 2001 ఫిబ్రవరి లో లక్ష్మినగర్‌లో షిర్డీసాయిబాబా మందిరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భక్తుల సహకారంతో బాబా కృపతో కేవలం పది నెలల్లోనే మందిరం నిర్మాణం పూర్తి చేశారు. 2001లో జూలై నెల గురుపూర్ణిమ రోజున బాబా వారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. అప్పటి నుంచి దేవాలయం భక్తుల రాకతో దినదినాభివృద్ధి చెందుతూ నగరంలోని ప్రముఖ సాయి ఆలయాల్లో మందు వరసలో చేరింది. ప్రతి నిత్యం వందలాంది భక్తులు వస్తుంటారు. గురువారం ఈ సంఖ్య వేలల్లో ఉంటుంది. గురుపౌర్ణమి, కార్తీక పౌర్ణమి, శివరాత్రి, మార్గశిర బహుళ అష్టమి, వినాయక నవరాత్రి ఉత్సవాలు తదితర పర్వదినాల్లో దేవాలయం ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలతో శోభాయమాన ంగా భక్తులతో కిటకిటలాడుతూ ఉంటుంది. దేవాలయంలో 2002లో ధుని(నిత్యాగ్నిహోత్రము)ని, అదే సంవత్సరం మే నెలలో ధ్యాన మందిరం, గ్రంథాలయాన్ని నిర్మించారు. కాగా రాష్ట్రంలో మరే సాయిబాబా మందిరంలో లేని విధంగా ఇక్కడ అద్దాల మందిరాన్ని 2003 ఏప్రిల్ నెలలో ప్రారంభించారు. అదేవిధంగా సుబ్రమణ్యంనగర్ కాలనీ నుంచి మందిరానికి వచ్చే మార్గంలో 2009లో దేవాలయ ం ముఖద్వారాన్ని భక్తుల సహకారంతో సుందరంగా, నయనానందకరంగా నిర్మించారు. బాబావారి విగ్రహ ప్రతిష్ట జరిగిన రోజైన ఫిబ్రవరి 25వ తేదీన ప్రతి ఏడాది భక్తులకు సాయిబాబా నిజపాద స్పర్శ దర్శన ం అవకాశాన్ని కల్పిస్తున్నారు. దేవాలయంలో ప్రతి రోజు నాలుగు హారతులతో పాటు నిత్య పూజలు, అభిషేకం, అర్చన, సహస్రనామార్చన, అష్టోత్తరములు జ

లక్ష్మినగర్‌లోని షిర్డీసాయిబాబా మందిరం

రుగుతాయి. ముఖ్యమైన పర్వదినాల్లో నామ సప్తాహం, సాయి సత్యవ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతం, హోమాలు నిర్వహిస్తారు. షిర్డీసాయి దేవాలయ ప్రాంగణంలో శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవాలయం, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలు ఉన్నాయి. శ్రీ మహాలక్ష్మి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన రోజు సందర్భంగా 26వ తేది గురువారం ఉదయం శ్రీ చక్ర కుంకుమార్చన, సాయంత్రం సామూహిక శ్రీ లలితాదేవి పారాయణం, కుంకుమార్చనను నిర్వహించనున్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు....

లక్ష్మినగర్ షిర్డీసాయిబాబా దేవాలయం 24వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈ నెల 22వ తేదీ ఆదివారం నుండి 26వ తేది గురువారం వరకు అయిదు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. విగ్రహ ప్రతిష్టాపన రోజు సందర్భంగా 25వ తేది బుధవారం ఉదయం 108 కలశాలతో అభిషేకం నిర్వహిస్తారు. బుధవారం ఒక్క రోజుమాత్రమే బాబా వారి నిజపాద స్పర్శ దర్శనం ఉంటుంది. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు ఆదివారం ఉదయం 8.30కు గణపతి పూజతో ఉత్సవాలు మొదలవుతాయి. అయిదు రోజుల పాటు ప్రత్యేక భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 26వ తేది గురువారం సాయంత్రం 7.30కు బాబా వారి రథోత్సవ ఊరేగింపు నిర్వహిస్తారు. కాగా వార్షిక బ్రహోత్సవాలకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భాబాను దర్శించుకుని సాయి నాధుడి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ : పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : రామంతాపూర్ డివిజన్ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్ ఆధ్వర్యంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు కార్యక్రమం చేపట్టడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం రామంతాపూర్‌లో ఎండి రఫీక్ స్వంత నిదులతో ఏర్పాటు చేసిన దోమల నివారణ యంత్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత ప్రజాసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. సమాజ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. డివిజన్ ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రతినిధి మహమ్మద్ తోఫీక్, పూస సత్తయ్య, నవీన్, ప్రమోద్, చిక్క

రామంతాపూర్‌లో దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.వరమేశ్వర్‌రెడ్డి, ఎం.డి.రఫీక్ తదితరులు

సత్యనారాయణ, నర్సింహా రెడ్డి, రవీందర్ రెడ్డి, ఆదినారాయణ గౌడ్, వల్లపు శ్రీకాంత్ యాదవ్, నామ్ రాజి రెడ్డి, బొక్క సురేష్, గరిక సుధాకర్, సందీప్, భాస్కర్, మొగిలి లింగం, బెస్త భాస్కర్, షాగ శ్రీధర్, సామ్యూల్, ఎండి నయీమ్, ముత్యాల జంగయ్య, సుర్వి సంతోష్, జంగయ్య, గాయత్రి, అంబికా, మెంగా శోభ, అనిత తదితరులు పాల్గొన్నారు.

భాషా నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు : ప్రిన్సిపల్ విజయ్‌కుమార్

ఉప్పల్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త : ఉప్పల్ లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయ్ కుమార్ సభాధ్యక్షత వహించగా, తెలుగు సహాయాచార్యులు, జల్దా విశ్వనాదజ్ కుమార్ సమన్వయం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ డా.కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ భాషా వైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధ్యక్షులుగా పదవీ విరమణ చేసిన ఆచార్య మసన చెన్నప్ప ముఖ్య అతిదిజగా హాజరయ్యారు. మాతృభాషతోనే మనుగడ – భాషే మన బలం, భాషే మన భవిష్యత్తు అని పేర్కొన్నారు. మాతృభాషే మన సంస్కృతి, మన ఆత్మ, దానితోనే మన గుర్తింపు. భాషతోనే మన ఆలోచనలకి రూపం, మన భావాలకి అర్థం. మాతృభాషను కాపాడుకోవడం అంటే మనుగడను కాపాడుకోవడమే అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె విజయ్ కుమార్ మాట్లాడుతూ బోధన, పత్రికలు, ప్రసార

ఓయు తెలుగు విభాగం అధ్యక్షునిగా పదవీ విరమణ చేసిన ఆచార్య మసన చెన్నప్పను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ తదితరులు

రంగం, సృజన రంగం, అనువాదం, ప్రచారం, ప్రజా సంబంధాలు, ప్రభుత్వపాలన, వ్యాపార, దౌత్య, పర్యాటక రంగాలలో భాషా నైపుణ్యాలు గల వారికి విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగు సహాయాచార్యులు జల్దా విశ్వనాదజ్ కుమార్ మాట్లాడుతూ భాషా వైవిధ్యం మన బలం, కానీ మాతృభాష మన మూలమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. సిహెచ్ సత్యనారాయణ, డా.జి. తిరుపతయ్య, పి.విజయ్ కుమార్, డా.వి.శ్రీనివాసరావు, డా. ఆర్ చంద్రసాగర్, డా.పి.వెంకటేశ్వర్లు, తెలుగు ఉపాధ్యాయులు నీరజ, శైలజ, లక్ష్మారెడ్డి, కృష్ణయ్య, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయంలో ఘనంగా ధ్వజ స్థంబ ప్రతిష్టాపన

పూజలు నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి దంపతులు

సైదాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో శ్రీ సిద్ధి బుద్ధి శ్రీ మహా గణపతి దేవాలయంలో ధ్వజ స్థంబ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐఎస్ సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి దంపతులు ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు గోవర్ధన్, భూపతి, మురళి మనోహర్, విజయ్ కుమార్, సంతోషి, అరుణ, మాధవి, పావని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి : రాజశేఖర్‌రెడ్డి

కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి శనివారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పరమేశ్వర్‌రెడ్డితో పాటు మల్కాజ్‌గిరి మున్సిపల్ కమీషనర్ వినయ్ కృష్ణారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా లింగోజిగూడ డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై వారు సమీక్షించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కమీషనర్‌ను కోరారు.

బిసిలు ఏకమైతే రాజ్యాధికారం సాధ్యం : కటకం

సదస్సులో మాట్లాడుతున్న కటకం నర్సింగరావు

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: బీసీలు ఐక్యమైతే రాజ్యాధికారం సాధ్యం అవుతుందని మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నరసింహారావు పేర్కొన్నారు. మన ఆలోచన సాధన సమితి ప్రధాన కార్యాలయంలో పద్మశాలి, కుమ్మరి కులాలకు మాస్ లీడర్షిప్ ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది. మాస్ కార్యదర్శి గుణగంటి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నరసింగరావు మాట్లాడుతూ బీసీల ఐక్యత విద్య చైతన్యం ద్వారానే రాజకీయ సాధికారత సాధ్యమవుతుందన్నారు. బీసీలు నాయకులుగా ఎదగడానికి కంకణ బదులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ, గుండ్ల ఆంజనేయులుగౌడ్, గోదా లింగస్వామిగౌడ్, బచ్చనబోయిన శ్రీనివాస్‌యాదవ్, పెద్దవూర బ్రహ్మయ్య, సిల్వర్ శంకర్‌ప్రజాపతి, మంగిలిపల్లి శంకర్, కైరంకొండ నర్సింగ్‌గంగపుత్ర, సామ పృథ్వీరాజ్, అమృతం మార్కండేయులు పాల్గొన్నారు.

పాఠశాల పనులకు శంకుస్థాపన

పాఠశాల శంకుస్థాపనలో పాల్గొన్న బుగ్గారపు వరుణ్‌గుప్తా

ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 21 ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొగ్గారపు వరుణ్‌గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని ప్రబుత్వ ప్రాథమిక పాఠశాల తరగతి గది నిర్మానానికి జెసిఐ హైదరాబాద్ డెక్కన్ ఆధ్వర్యంలో నిధులు కేటాయించి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెసిఐ హైదరాబాద్ డెక్కన్ సబ్యులు సుఖేష్ కుమార్ జీవార్, రాహుల్ అగర్వాల్, శ్రేయ అగర్వాల్, రోహిత్ మెహతా, జితేష్ అగర్వాల్, కాంగ్రెస్ నాయకులు చెరుకు భవానిగౌడ్, జాంగిర్‌బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ నైపుణ్యాలకు నాంది పలికిన ఎంపోరియో

విద్యార్థుల ప్రతిభను ప్రశంసించిన మేజర్ జనరల్ కృష్ణన్

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 21,ప్రభాతవార్త : భవన్స్ వివేకానంద కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20, 21 తేదీల్లో నిర్వహించిన రెండు రోజుల ఎంపోరియో ఫెస్ట్ ఘనంగా ముగిసింది. కంప్యూటర్స్, రెగ్యులర్, ఫైనాన్స్ విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఫెస్ట్‌కు సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల విద్యార్థులూ పెద్ద సంఖ్యలో హాజరై ఆర్థిక ఆలోచన, వ్యూహాత్మక ప్రణాళికలో తమ ప్రతిభను చాటుకున్నారు. ఫెస్ట్‌ను అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎం.కామ్ సమన్వయకర్త డాక్టర్ డి. సంజీవరావు ప్రారంభించి, ఆధునిక ఆర్థిక వాతావరణానికి అనుగుణంగా విశ్లేషణాత్మక దృక్పథం పెంపొందించుకోవాలని సూచించారు.అర్థ నీతి, చక్రవ్యూ పోటీలు ప్రధాన ఆకర్షణలుగా నిలిచి విద్యార్థుల మేధస్సు, నిర్ణయ సామర్థ్యాలను పరీక్షించాయి.ముఖ్య అతిథిగా హాజరైన మేజర్ జనరల్ ఎం.ఎస్.ఎస్. కృష్ణన్ (వి.ఎస్.ఎం బార్) విజేతలకు బహుమతులు అందజేశారు. తరగతి గది అభ్యాసాన్ని ఆర్థిక ప్రపంచానికి అన్వయించే వేదికగా ఫెస్ట్ నిలిచిందని, విద్యార్థుల నాయకత్వ, నిర్వహణ లక్ష